క్లుప్తంగా

జీబీఎస్ వ్యాధితో కండరాల రుగ్మత



జీబీఎస్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అడ్డాల

కాకినాడ రూరల్: నాడీ వ్యవస్థను దెబ్బతీసే జీబీఎస్ వ్యాధి కండరాల రుగ్మత అని, ఇది వేగవంతంగా కండరాలపై ప్రభావం చూపుతుందని వైద్యుడు అడ్డాల సత్యనారాయణ అన్నారు. అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో గురువారం అవగాహన కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ, జీబీఎస్ వలన కండరాల బలహీనతతో పాటు, వెనుక భాగంలో నొప్పి, పాదాలు, చేతుల్లో నొప్పులు ప్రారంభమై శరీరం మొత్తానికి వ్యాపిస్తుందన్నారు. ఇది చాలా అరుదైన వ్యాధి అని, కలుషిత ఆహారం, నీటి వలన వస్తుందన్నారు. దీని నివారణకు కాచి చల్లార్చిన నీటిని తాగాలని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు, తాజా పండ్లు, కాయగూరలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, బుద్ధరాజు సత్యనారాయణరాజు, పార్వతి, చింతపల్లి సుబ్బారావు, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, పట్నాయక్, రాజా తదితరులు పాల్గొన్నారు.

మామాజీకి నివాళి



మద్దూరి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

బోట్‌క్లబ్: వీహెచ్‌పీ నాయకుడు, హిందూ ధర్మ పరిరక్షకుడు కె.మద్దూరి శ్రీరామచంద్రమూర్తి (మామాజీ) సేవలకు, త్యాగానికి ప్రతిరూపమని సంస్థ జిల్లా అధ్యక్షుడు రవిశంకర్ పట్నాయక్ కొనియాడారు. స్థానిక గాంధీనగర్‌లోని వీహెచ్‌పీ కార్యాలయంలో గురువారం మామాజీ సంస్మరణ సభ జరిగింది. పలువురు వక్తలు మాట్లాడుతూ, గిరిజన పిల్లల పాఠశాల అభివృద్ధి ఎంతో కృషి చేశారన్నారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి నాయకులు నివాళులర్పించారు.

ఎమ్మెల్సీ అభ్యర్థి సుందర్‌కు మద్దతుగా ప్రచారం



యండమూరులో ప్రచారం చేస్తున్న వైఎస్ ఎంపీపీ, మాజీ సర్పంచ్

కరప: ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి జీవీ సుందర్‌కు మద్దతుగా గురువారం మండల ఎస్సీ నాయకులు ప్రచారం చేశారు. విజయరాయుడుపాలెం, పెద్దాపురప్పాడు, యండమూరు తదితర గ్రామాల్లో వైస్ ఎంపీపీ బొమ్మిడి వీర్రాఘవులు, మాజీ సర్పంచ్ మార్నెళ్ల వెంకటరమణ, ఎస్సీ నాయకులు సాదే లోహిదాస్, వజ్రపు కామేశ్వరరావు, సవిలే రాజేష్ తదితరులు పర్యటించి, గ్రాడ్యుయేట్ ఓటర్లను కలిశారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో స్వతంత్ర అభ్యర్థి సుందర్‌ను గెలిపించాలని అభ్యర్థించారు.

రాఘవేంద్రస్వామి ఆలయ వార్షికోత్సవం

బోట్‌క్లబ్: రాఘవేంద్రస్వామి బృందావన సేవా సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో స్వామివారి ఆలయ 47వ వార్షికోత్సవం గురువారం ప్రారంభమైంది. పేజావర అదోక్ష పీఠాధిపతి విశ్వేశ్వర తీర్థ స్వామిజీ ప్రతిష్ఠించిన రాఘవేంద్రస్వామి బృందావనం దినదిన ప్రవర్ధమానమైందని ఆలయ ప్రధానార్చకుడు రవీంద్ర భట్ అన్నారు. మూడు రోజులు పాటు విశేష హోమాలు, పూజలు, దీపారాధన, రంగపూజ, బ్రహ్మ కలశాభిషేకాలు, పంచామృతాభిషేకాలు, విశేష పుష్పాలంకరణ, స్వామివారి రథోత్సవం జరుగుతాయని వివరించారు. తొలుత తులాభార సేవ నిర్వహించారు. ట్రస్ట్ ప్రతినిధులు భగీరథశర్మ, వై.రాఘవేంద్రరావు, వెంకటరత్నం, అనంతరామారావు, వెంకటేష్, యాతగిరి పరశురామ్, తుంగమణి పాల్గొన్నారు.

కాకినాడ సినిమాలు

ఆనంద్ సినిమాస్:	జాబిలమ్మ నీకు అంత కోపమా, రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్, సంక్రాంతికి వస్తున్నాం, డాకు మహారాజ్
దేవి మల్టీప్లెక్స్:	బాపు, జాబిలమ్మ నీకు అంత కోపమా, రామం రాఘవమ్, తండేల్
లక్ష్మి:	బ్రహ్మ ఆనందం
సత్యగౌరి:	రామం రాఘవమ్
తిరుమల:	సంక్రాంతికి వస్తున్నాం
సీఅండ్‌సీ-1:	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్
సీఅండ్‌సీ-2:	లైలా
పద్మప్రియ:	తండేల్
శ్రీప్రియ:	రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్

అన్నీ నో బాల్సే..

- కలగానే జిల్లా క్రికెట్ స్టేడియం
- దశాబ్దాలుగా కార్యరూపం దాల్చని వైనం
- స్థలం ఉంటే నిధులు ఇచ్చేందుకు ఏసీఏ సిద్ధం!

ఆర్ఎంసీ క్రీడా మైదానం



నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సుమారు ఐదు దశాబ్దాల చరిత్ర కలిగిన క్రికెట్ సంఘానికి జిల్లాలో సొంత స్టేడియం అనేది కలగానే మిగిలిపోయింది. గతంలో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు సంబంధించిన స్థలంలో స్టేడియం నిర్మాణానికి ప్రతిపాదనలు వచ్చినా, కొన్ని కారణాల వల్ల కార్యరూపం దాల్చలేదు. తరువాత 2020లో బాలురు, బాలికల క్రికెట్ సంఘంగా ఉన్న, అప్పటి జిల్లా క్రికెట్ సంఘ అధ్యక్షుడు టి.హరీష్, కార్యదర్శి కిరణ్‌రాజు ఆధ్వర్యంలో కాకినాడ గ్రామీణ గురజనాపల్లిలో 18 ఎకరాల్లో క్రికెట్ స్టేడియం ఏర్పాటుకు ఏసీఏకు ప్రతిపాదనలు పంపించారు. దీనిపై ఏసీఏ సానుకూలంగా స్పందించి, రూ.3.5 కోట్ల నిధులు ఇచ్చేందుకు ముందుకొచ్చింది. తరువాత బాలురు, బాలికల క్రికెట్ సంఘాన్ని కాదని, జిల్లా క్రికెట్ పగ్గాలు లోథ కమిటీ ద్వారా తూర్పు గోదావరి జిల్లా క్రికెట్ సంఘానికి ఏసీఏ అప్పగించింది. దీంతో గురజనాపల్లి కథ స్టేడియం రాకుండానే ముగిసింది. ప్రస్తుతం అచ్చంపేట జంక్షన్ సమీపంలోని ప్రభుత్వ భూమిని స్టేడియం కోసం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అందులో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసి, అభివృద్ధి చేయాలని ప్రస్తుతం ఉన్న క్రికెట్ సంఘం, కాకినాడకు చెందిన ప్రజాప్రతినిధి, ఏసీఏ కార్యదర్శి సానా సతీష్‌బాబు ద్వారా ప్రయత్నిస్తున్నారు. సంఘం ఏర్పడి ఐదు దశాబ్దాలు కావస్తున్నా, సొంత స్టేడియం అనేది లేకపోవడం క్రీడాకారులను, అభిమానులను నిరాశకు గురిచేస్తోంది.

జిల్లా క్రికెట్ ప్రస్థానమిదీ..

జిల్లాలో క్రికెట్ సంఘం 1968లో ఏర్పడింది. పూర్తి స్థాయి గుర్తింపు పొందిన సంఘంగా 1975లో ఆవిర్భవించింది. సంఘానికి తొలి అధ్యక్షుడిగా డాక్టర్ డీపీ రామారావు, కార్యదర్శిగా ఎస్ఎంఎన్ రామచంద్రరాజు, ఉపాధ్యక్షుడిగా గోపన్న కొమ్మిరెడ్డి, సంయుక్త కార్యదర్శులుగా దివంగత డాక్టర్ కేటీ మాథ్యూస్, ప్రభాకర్ వ్యవహరించారు. 1975 నుంచి 2003 వరకు కికెట్ సంఘానికి కార్యాలయం అంటూ ఏదీ లేదు. స్థానిక పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో శిక్షణ ఇచ్చేవారు. 2003లో అప్పటి జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఏంఏ దీన్ సహాయంతో కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో క్రికెట్ కార్యాలయం ఏర్పాటైంది. అక్కడే క్రీడాకారులు ప్రాక్టీస్ చేసేవారు. 2006లో రంగరాయ వైద్య కళాశాల క్రీడా మైదానానికి మారింది. అక్కడే క్రికెట్ నెట్స్, పిచ్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకూ అక్కడే శిక్షణ అందిస్తున్నారు. ప్రస్తుతం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడ మెయిన్ సెంటర్, పెద్దాపురం, రాజమహేంద్రవరం, అంబాజీపేటలో సబ్ సెంటర్లు నిర్వహిస్తున్నారు. ఆయా సెంటర్లలో లెవెల్-1, 2 కోచ్‌లతో శిక్షణ అందిస్తున్నారు. క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అండర్-10, 12, 14, 16, 19, 22, 25, మెన్, ఉమెన్ కేటగిరీల్లో శిక్షణ ఇస్తున్నారు. జిల్లా క్రికెట్ శిక్షణ కేంద్రంలో రంజీ స్థాయి పిచ్‌లు 3, రెండు రోలర్లు, రూ.3.5 లక్షల విలువైన బౌలింగ్ మెషీన్లు, బెర్ముడా గ్రాస్ కట్టర్, నెట్లు ఉన్నాయి. క్రికెట్ సంఘ కార్యకలాపాల నిర్వహణకు ఏసీఏ ఏటా రూ.20 లక్షలు నిధులు అందిస్తుంది.

ప్రస్తుత సంఘమిదే..

ప్రస్తుత ఉమ్మడి తూరుగోదావరి క్రికెట్ సంఘానికి డాక్టర్ శివకుమార్ అధ్యక్షునిగా, పి.సత్యనారాయణ కార్యదర్శిగా, రఫీఅహ్మద్ కిద్వాయి ఉపాధ్యక్షునిగా, ఎన్.వెంకటేష్ కోశాధికారిగా, భాస్కర్‌రామ్ సంయుక్త కార్యదర్శిగా, మరో ఏడుగురు సభ్యులుగా కొనసాగుతున్నారు.

అభివృద్ధికి ఎంఓయూ అడ్డంకి

ప్రస్తుతం క్రికెట్ సంఘ కార్యకలాపాలు, జిల్లా శిక్షణా కేంద్రం ఆర్ఎంసీ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్నారు. రంగరాయ వైద్య కళాశాల యాజమాన్యానికి, జిల్లా క్రికెట్ సంఘానికి మధ్య గతంలో ఎంఓయూ ఉండేది. పదేళ్ల నుంచి నోటిమాట ద్వారానే కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఏసీఏ నిబంధనల ప్రకారం మైదానంలో దాని నిధులతో ఏమైనా శాశ్వత భవనాలు (జిమ్ రూమ్, డ్రస్సింగ్ రూమ్, కార్యాలయం) నిర్మించాలంటే ఎంఓయూ తప్పనిసరి. దీంతో ఎంఓయూ లేని కారణంగా ఏసీఏ క్రికెట్ అభివృద్ధికి నిధులు అందించేందుకు సాధ్యం కావడం లేదు. కేవలం క్రికెట్ కార్యకలాపాలకు మాత్రమే ఏసీఏ నిధులు అందిస్తుంది.

స్టేడియం కోసం ప్రయత్నిస్తున్నాం



జిల్లాలో క్రికెట్ స్టేడియం నిర్మాణానికి స్థలం కోసం ముమ్మరంగా ప్రయత్నిస్తున్నాం. ఏసీఏ కార్యదర్శి, రాజ్యసభ సభ్యులు సానా సతీష్‌బాబు హయాంలో స్థలం సమకూరితే, ఏసీఏ నిధులతో స్టేడియం నిర్మాణం పూర్తవుతుంది. 6 నుంచి 8 ఎకరాల స్థలంలో స్టేడియం ఏర్పాటు చేయాలని యోచిస్తున్నాం.

– పసుపులేటి సత్యనారాయణ, కార్యదర్శి, జిల్లా క్రికెట్ సంఘం

నేడు మంచినీటి సరఫరా నిలిపివేత

కాకినాడ సిటీ: నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఏడీబీ రోడ్డు అచ్చంపేట జంక్షన్ నుంచి సామర్లకోట వరకు చేపట్టిన రోడ్డు పనులు ఇంకా పూర్తి కానుందున స్థానిక శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి నీటి సరఫరా శుక్రవారం కూడా జరగదని కార్పొరేషన్ కమిషనర్ భావన తెలిపారు. ఈ నెల 17 నుంచి గురువారం వరకు నగరంలోని పలు ప్రాంతాలకు మంచినీటి సరఫరా నిలుపుదల చేసినట్టు చెప్పారు. శుక్రవారం నుంచి ఎప్పటిలాగే తాగునీటి సరఫరా జరగాల్సి ఉందని, పనులు పూర్తి కానందున శనివారం నుంచి తాగునీటి సరఫరా చేస్తారని తెలిపారు. ఈ కారణంగా శశికాంత్‌నగర్ ఫిల్టరేషన్ ప్లాంట్ నుంచి మంచినీటి సరఫరా జరిగే రిజర్వాయర్ల నుంచి శశికాంత్‌నగర్, శ్రీవిద్యకాలనీ, భాస్కర్ నగర్, దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ, శ్రీనివాసబ్యాంకు కాలనీ (1 నుంచి 13, 49, 50 వార్డులు) ప్రాంతాల పరిధిలో ఉన్న ప్రజలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేస్తారని వివరించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి, కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి బుధవారం రాత్రి మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు, కరప గ్రామానికి చెందిన శివకోటి బాలరాజు(49)ను బుధవారం సాయంత్రం లారీ ఢీకొంది. అతడి ఎడమ చేతికి తీవ్ర గాయం కాగా, చికిత్స కోసం కాకినాడ ప్రభుత్వాస్పత్రికి తరలించిన విషయం విదితమే. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ అతడు చనిపోయాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై టి.సునీత కేసు దర్యాప్తు చేస్తున్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పావురాలను ఎగుర వేసి క్రీడలు ప్రారంభిస్తున్న అతిథులు

బాలాజీచెరువు: విద్యార్థులకు క్రీడల ద్వారా మానసికోల్లాసం కలుగుతుందని మహిళా పాలిటెక్నిక్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ ముస్తఫా కమాల్ బాషా అన్నారు. స్థానిక శాంతినగర్ శ్రీచైతన్య ప్రీ ప్రైమరీ పాఠశాలలో గురువారం స్పోర్ట్స్‌మీట్‌ను పావురాలు ఎగురవేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పీడీ కమాల్ బాషా మాట్లాడుతూ, క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. పాఠశాల స్థాయి నుంచి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తి ఉండాలన్నారు. చదువుతో పాటు, క్రీడలు, సంస్కృతీ సంప్రదాయాలను పెంపొందించుకోవాలని పాఠశాల ఏజీఎం సురేష్, ఆర్ఐ గోపీనాథ్ సూచించారు. అనంతరం క్రీడల్లో ప్రతిభ చూపిన వారికి మెడళ్లు, ప్రశంసాపత్రాలు అందజేశారు. హెచ్ఎం నాగమణి, ప్రిన్సిపాల్ సుల్తానా, రాఘవేంద్ర పాల్గొన్నారు.

పీఆర్‌జీ ప్రిన్సిపాల్‌పై విచారణ

బాలాజీచెరువు: పీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బీవీ తిరుపాణ్యంపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో గురువారం కళాశాలలో కమిటీ సభ్యులు విచారణ చేపట్టారు. కళాశాలకు చెందిన రిటైర్డ్ అధ్యాపకుడు కళాశాల పరీక్షల విభాగంలో నిధులు దుర్వినియోగం జరిగాయంటూ విద్యాశాఖ కమిషనర్ ఇచ్చిన ఫిర్యాదు నేపథ్యంలో గతేడాది నవంబర్‌లో రాజమహేంద్రవరం ఆర్‌జేడీ అధ్యక్షతన ఏకసభ్య విచారణ చేపట్టి, నివేదిక అందజేశారు. తాజాగా గుంటూరు ఆర్‌జేడీ అధ్యక్షతన మరో ముగ్గురు సభ్యులతో కమిటీ ఏర్పాటు చేసి, కళాశాలలో మూడు రోజుల పాటు విచారణ చేపట్టనున్నారు. తొలి రోజు కళాశాలకు సంబంధించి రికార్డులు, ఆదాయవ్యయాలకు సంబంధించిన ఫైళ్లు పరిశీలించారు. రికార్డుల పరిశీలన పూర్తయ్యాక డిపార్ట్‌మెంట్ల వారీగా అధ్యాపకులను విచారణ చేయనున్నారు.

సామాజిక న్యాయమే న్యాయస్థానాల లక్ష్యం



సదస్సులో మాట్లాడుతున్న రవిశంకర్ పట్నాయక్

కాకినాడ రూరల్: సమాజంలోని అసమానతలు తగ్గించడానికి సామాజిక న్యాయమే న్యాయస్థానాల లక్ష్యమని న్యాయవాది రవిశంకర్ పట్నాయక్ అన్నారు. ప్రపంచ సామాజిక న్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక రమణయ్యపేటలో గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి రవిశంకర్ పట్నాయక్ మాట్లాడుతూ, పేదరిక నిర్మూలన, అందరికీ చదువు, సమన్యాయం, గౌరవంగా పని చేయగలిగే స్థితి కలగడం ద్వారా సామాజికంగా న్యాయం లభించినట్టు అవుతుందన్నారు. పేద, ధనిక వర్గాల అసమానతలు తగ్గాలన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ ప్రతినిధులు అడబాల రత్నప్రసాద్, రెడ్నం రాజా, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, చింతపల్లి సుబ్బారావు, బుద్ధరాజు సత్యనారాయణరాజు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

భీమేశ్వరుని సన్నిధిలో సంగీత దర్శకుడు రామాచారి



పంచారామ క్షేత్రంలో రామాచారి దంపతులు

సామర్లకోట: సినీ సంగీత దర్శకుడు, సినీ గాయకులు కోమండూరి రామాచారి దంపతులు గురువారం స్థానిక పంచారామ క్షేత్రంలో కుమారారామ భీమేశ్వరస్వామి, బాలాత్రిపుర సుందరీదేవిని దర్శించుకున్నారు. పూజల అనంతరం ఆలయ పండితులు ఆ దంపతులకు ఆశీర్వచనాలు, ఈఓ నీలకంఠం స్వామివారి ప్రసాదం అందజేశారు. వీరి వెంట స్థానిక కళాకారులు బడుగు బాబి, చీమలకొండ వీరభద్రప్రసాద్, గిడుతూరి శ్రీనివాసు ఉన్నారు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి

- పీఆర్ఆర్డీ అసిస్టెంట్ కమిషనర్



డిజిటల్ అసిస్టెంట్లకు సర్టిఫికెట్లు ఇస్తున్న కృష్ణమోహన్, ప్రొఫెసర్లు

సామర్లకోట: సాంకేతిక శిక్షణను డిజిటల్ అసిస్టెంట్లు సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి సంస్థ అసిస్టెంట్ కమిషనర్ ఈ.కృష్ణమోహన్ అన్నారు. శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విశాఖపట్నం, అనకాపల్లి, కాకినాడ, తూర్పు గోదావరి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, పశ్చిమ గోదావరి, ఏలూరు జిల్లాల్లోని డిజిటల్ అసిస్టెంట్లకు మూడు రోజుల శిక్షణ సామర్లకోట విస్తరణ శిక్షణా కేంద్రంలో గురువారం ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణమోహన్ మాట్లాడుతూ, మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన ఉండాలన్నారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ అధికారులు ఇచ్చిన శిక్షణ ద్వారా మంచి ఫలితాలు రాబట్టాలన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారికి సర్టిఫికెట్లు అందజేశారు. ఎన్ఐఆర్‌డీపీఆర్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎంవీ రవిబాబు, అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజేశ్వర్, ఈటీసీ ఫ్యాకల్టీలు డీఆర్ఎన్ పద్మ, ఎస్కే మొహిద్దీన్ పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా సాగర తీరం



సూర్యారావుపేట బీచ్‌ను అధికారులతో సందర్శిస్తున్న భావన

- కౌడా వైస్ ఛైర్‌పర్సన్, కమిషనర్ భావన
- బీచ్ అభివృద్ధి, సుందరీకరణ పనుల పరిశీలన

కాకినాడ రూరల్: సాగర తీరాన్ని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దుతున్నామని కాకినాడ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ ఛైర్‌పర్సన్, నగరపాలక సంస్థ కమిషనర్ భావన పేర్కొన్నారు. సూర్యారావుపేటలోని న్యూ ఎన్టీఆర్ బీచ్‌ను గురువారం ఆమె సందర్శించారు. బీచ్ పరిసరాలలో జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను పరిశీలించారు. పర్యాటకుల కోసం బీచ్‌ను ఆహ్లాదకరంగా ఏ విధంగా తీర్చిదిద్దాలో అధికారులకు సూచనలు చేశారు. సూర్యారావుపేట పంచాయతీ పరిధిలో బీచ్ ఉండడంతో ఆ గ్రామ పంచాయతీ అధికారులకు పరిశుభ్రతతో పాటు పలు అంశాలుపై తీసుకోవల్సిన చర్యలు గురించి వివరించారు. బీచ్ సుందరీకరణకు సంబంధించి కాకినాడ కార్పొరేషన్ ఎస్ఈ కామేశ్వరరావు, ఎంఈ మత్స్యరాజు వివరాలు కమిషనర్‌కు తెలియజేడయంతో వాటిపై చర్చించారు. కార్యక్రమంలో కౌడా, జిల్లా పంచాయితీ అధికారులు పాల్గొన్నారు.



పారిశుధ్య పనులను పరిశీలిస్తున్న కమిషనర్ భావన

పారిశుధ్య పనుల తనిఖీ

కాకినాడ సిటీ: ప్రజా సమస్యల పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ పనుల తనిఖీల్లో భాగంగా నగరపాలక సంస్థ కమిషనర్ భావన గురువారం తెల్లవారుజాము నుంచి పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఇందులో భాగంగా స్థానిక రామారావుపేట సుబ్బయ్య హోటల్ రోడ్డు, పీఆర్ కళాశాల రోడ్డులోని ఈట్ స్ట్రీట్ తదితర ప్రాంతాల్లో పారిశుధ్య పనులను తనిఖీ చేశారు. రోడ్లు, డ్రైన్ల పరిశుభ్రత, చెత్త సేకరణ ఎలా జరుగుతోందన్న విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా పారిశుధ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎంహెచ్‌వో డాక్టర్ పృథ్వీచరణ్, శానిటరీ సూపర్‌వైజర్లు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

శానిటరీ మేస్త్రీపై గుర్తు తెలియని వ్యక్తి దాడి



ఆందోళన చేస్తున్న కార్మికులు

పిఠాపురం: పారిశుధ్య పనులు పర్యవేక్షిస్తున్న శానిటరీ మేస్త్రీపై గుర్తుతెలియని వ్యక్తి దాడికి పాల్పడిన సంఘటనలో బాధితుడికి న్యాయం చేయాలంటూ గురువారం స్థానిక మున్సిపాలిటీ మస్టరు కార్యాలయం వద్ద కార్మికులు ఆందోళనకు దిగారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు, పిఠాపురం మున్సిపాలిటీలో శానిటరీ మేస్త్రీ పాట్నూరి పైడిరాజు బుధవారం మధ్యాహ్నం విధుల్లో ఉన్నారు. గుర్తు తెలియని వ్యక్తి అతనిపై దాడికి పాల్పడ్డాడు. పక్కనున్న కార్మికులు అడ్డుకునేందుకు యత్నించినా, ఆ వ్యక్తి ఆగకుండా దాడి చేయడంతో పైడిరాజుకు గాయాలయ్యాయి. ఇతర కార్మికులు ఆయనను ఆస్పత్రికి తరలించారు. తనపై దాడి చేసి, కులం పేరుతో దూషించాడని పైడిరాజు పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితుడిని అరెస్టు చేయాలని, బాధితుడికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ కార్మికులు మస్టరు కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు.

మహా శివరాత్రికి డ్రోన్లతో ప్రత్యేక నిఘా

- జిల్లా ఎస్పీ బిందు మాధవ్
- పాదగయ క్షేత్రంలో ఏర్పాట్ల పరిశీలన



పాదగయ క్షేత్రంలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

పిఠాపురం: రానున్న మహా శివరాత్రి ఉత్సవాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డ్రోన్లతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేస్తున్నట్టు జిల్లా ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఆయన గురువారం పిఠాపురం పాదగయ క్షేత్రంలో మహా శివరాత్రి ఉత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పాదగయ క్షేత్రానికి ఈ ఏడాది లక్ష మంది భక్తులు వస్తారని ఆలయ అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. సుమారు 70 వేల మంది దర్శనానికి వస్తారని అంచనా వేస్తున్నామన్నారు. దానికి తగ్గట్టుగా ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. గతంలో జరిగిన ఉత్సవాలు, గత అనుభవాలను దృష్టిలో పెట్టుకుని తగిన ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. గతంలో జరిగిన స్వల్ప తప్పిదాలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. అవసరమైతే అధిక భక్తుల తాకిడి ఉండే పిఠాపురం, సామర్లకోట ఆలయాల వద్ద పోలీసు బందోబస్తు పెంచడానికి చర్యలు తీసుకుంటామన్నారు. క్యూలైన్ల ఏర్పాటు, లోపలికి, బయటకు దారుల ఏర్పాట్లు తదితర వాటిపై అధికారులకు సూచనలు ఇస్తున్నామన్నారు. ఉత్సవ ఏర్పాట్లపై ఇప్పటికే కలెక్టర్‌తో మాట్లాడి దానికి తగ్గట్టుగా ప్రస్తుతం అధికారులకు సూచనలు ఇస్తున్నామన్నారు. భక్తులు పిండ ప్రదానాలు, దర్శనం, పుణ్యస్నానం చేసుకుని సురక్షితంగా వెళ్లేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇటీవల ఆలయాల వద్ద జరిగిన సంఘటనల నేపథ్యంలో పోలీసు సిబ్బందితో పాటు, భక్తుల సహకారం తీసుకుంటామన్నారు. భక్తులు పాటించాల్సిన సూచనలు, నిబంధనలను మైకుల ద్వారా విస్తృత ప్రచారం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కంట్రోల్ రూం, తగినన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. బారికేడ్ల ఏర్పాటు, పార్కింగ్ తదితర విషయాలపై స్థానిక సీఐ జి.శ్రీనివాస్‌తో చర్చించారు. ఇతర ఏర్పాట్లపై ఆలయ ఈఓ కాట్నం జగన్మోహన్ శ్రీనివాస్‌ను అడిగితెలుసుకున్నారు. ఈయన వెంట ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, ఎస్సై మణికుమార్ తదితరులున్నారు.

భక్తులకు ఇబ్బంది లేకుండా బందోబస్తు

- పంచారామ క్షేత్రాన్ని పరిశీలించిన ఎస్పీ

సామర్లకోట: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా పంచారామ క్షేత్రంలో భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా, పూర్తి స్థాయిలో బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్పీ బిందు మాధవ్ తెలిపారు. ఈ నెల 24 నుంచి ఆలయంలో జరిగే మహా శివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. 24న రాత్రి స్వామివారి కల్యాణం, 26న మహా శివరాత్రి, 27న రథోత్సవం ఉంటుందని ఈఓ బళ్ల నీలకంఠం ఎస్పీకి వివరించారు. అవుట్ గేటు నుంచి ఎవరూ రాకుండా చేస్తే ఆలయంలో భక్తులకు ఇబ్బంది ఉండదని ఈఓ ఆయనతో చెప్పారు. ఉచిత, రూ.20, రూ.100 క్యూలైన్లు, ఆలయ కోనేరు, గోదావరి కాలువలో భక్తులు స్నానాలు చేసే రేవు, మహిళలు దుస్తులు మార్చుకునే గదులను ఎస్పీ పరిశీలించారు. వీఐపీలు స్వామివారిని దర్శించుకునే విధానాన్ని ఎస్పీ తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ విలేకర్లతో మాట్లాడుతూ, గతేడాది లోపాలను సరిదిద్దుకుంటూ, సౌకర్యాలు ఉంటాయని తెలిపారు. నిర్దేశిత ప్రదేశాల్లోనే వాహనాలను పార్కింగ్ చేయాలన్నారు. ఆయన వెంట సీఐ ఎ.కృష్ణభగవాన్, ట్రాఫిక్ ఎస్సై అడపా గరగారావు, ఆలయ సూపరింటెండెంట్ ఈశ్వరరావు ఉన్నారు. తొలుత ఎస్పీకి ఆలయ మర్యాదలతో ఈఓ స్వాగతం పలికారు. ఆలయంలోని కాలభైరవస్వామి, పెద్ద నంది, మూలవిరాట్‌ను ఎస్పీ దర్శించుకున్నారు. శివలింగానికి అభిషేకం చేశారు.

వాహనాల తనిఖీ



కొవ్వాడలో వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్సై

కాకినాడ రూరల్: మండలంలోని చీడిగ, కొవ్వాడ గ్రామాలలో ఇంద్రపాలెం పోలీసులు గురువారం వాహనాల తనిఖీ నిర్వహించారు. చైన్ స్నాచర్లు సంచరిస్తున్నారనే సమాచారంతో ఎస్సై ఎం.వీరబాబు సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ చేపట్టారు. నంబరు ప్లేట్లు లేని 20 వాహనాల రికార్డులను తనిఖీ చేశారు. జిల్లా ఎస్పీ బిందు మాధవ్ ఆదేశాల మేరకు, కాకినాడ రూరల్ సీఐ చైతన్యకృష్ణ ఆధ్వర్యంలో ఇంద్రపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీ ముమ్మరం చేశామని ఎస్సై తెలిపారు. మహిళలను లక్ష్యంగా పెట్టుకుని. వారి మెడలోని బంగారు ఆభరణాలను అపహరించుకుపోయే చైన్ స్నాచర్లపై నిఘా ఉంచామన్నారు.

పంచారామ క్షేత్రానికి పుణ్య నదీ జలాలు

సామర్లకోట: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఈ నెల 26న లింగోద్భవకాల అభిషేకాలు చేయడానికి దేశంలోని వివిధ ప్రాంతాల్లోని పుణ్యనదీ జలాలు గురువారం సాయంత్రం సామర్లకోట పంచారామ క్షేత్రానికి చేరాయి. జలాలను తీసుకొచ్చిన వేద పండితులకు ఈఓ బళ్ల నీలకంఠం పూర్ణకుంభ స్వాగతం పలికారు. గంగా, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణా, కావేరి, భీమరాధి, పుష్కరిణి, తుంగభద్ర, సింధు, ప్రణీత నదులకు చెందిన జలాలను తీసుకొచ్చినట్టు ఈఓ తెలిపారు.